తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం    సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
బుధవారం
06 మే 2026
పేజీలు : 8
Follow :



## డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ప్రారంభోత్సవానికి సిద్ధం చెయ్యాలి

### కలెక్టర్ చంద్రశేఖర్



**జనంసాక్షి,, మిర్యాలగూడ :** మిర్యాలగూడ పట్టణం గుమస్తాల కాలనీలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీ ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన గుమస్తాల కాలనీలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీకి వచ్చే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెత్తా,చెదారం, చెట్ల తొలగింపు తో పాటు, రోడ్డును డోజర్ తో గుంతలు పూడ్చి సమాంతరం చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలోని డ్రైన్లు త్రీఫేజ్ పవర్, ప్రతి ఇంటికి ఎర్తింగ్, కరెంట్ మీటర్లు ఏర్పాటు చేసేలా చూడాలని ఆర్ అండ్ బిఎస్ ఈ శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు. ప్రతి ఇంటిపై వాటర్ ట్యాంకులకు నీటిని ఎక్కించి నీటి సరఫరాను పరిశీలించాలని, అలాగే ప్రతి ఇంట్లో వైరింగ్ తో పాటు, ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అన్ని పనులు వేగంగా పూర్తి చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. బుధవారంలోగా వాటర్ ట్యాంకులను నీటితో నింపడం ,ప్రతి ఇంటికి నీటి సరఫరాను తనిఖీ చేయడం పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి ఇంట్లో టాప్ కనెక్షన్‌తో పాటు, బల్బులు, ఇతర సౌకర్యా లు చూడాలన్నారు. ఎక్కడా ఓపెన్ డ్రైనేజీ ఉండడం, పైపులు పగిలిపోవడం లేదా భవిష్యత్తులో సమస్యలు వచ్చేలా ఉండ కుండా చూడాలని ఆదేశించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ఇతర మంత్రులు, ప్రజా ప్రతినిధులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీ ప్రారంభానికి హాజరుకానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లన్నీ చూడాలని, అలాగే ప్రారంభో త్సవం సందర్భంగా ఏర్పాటు చేసే సభా వేదిక, ఇతర ఏర్పాట్లను కూడా చేయాలని, అధికారులు సమన్వయం తో పని చేయాలని ఆదేశించారు. అయన వెంట గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, మిర్యాలగూడ ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్, మున్సిపల్, ఇతర అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## మే 10 వరకు స్వీయ గణన చేసుకునేందుకు అవకాశం

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** జనగణనలోస్వీయ గణన చేసుకునేందుకు ఇంకా కేవలం 5 రోజులు మాత్రమే గడువు ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, ఐటీ రంగ నిపుణులు మరియు అన్ని వర్గాల వారు స్వీయ గణన పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.తమ వివరాలను నమోదు చేసుకోని వారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. జనగణన సంబంధించి స్వీయ గణన మే 10 వరకు అవకాశం ఉందని తెలిపారు.మొదటి దశలో భాగంగా నిర్వహించే గృహ లెక్కింపు, గృహ పరిస్థితుల లెక్కింపు కోసం ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు.జిల్లా ప్రజలు తమ ఇంటి, కుటుంబ వివరాలను ప్రభుత్వ అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.మొబైల్ ఫోన్, కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని తెలిపారు.

## పద్మ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అభినందనలు:జిల్లా కలెక్టర్



**నల్లగొండ ప్రతినిధి,మే 5,జనంసాక్షి:** విద్యార్థులు మరింత కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నల్గొండ పట్టణంలోని పద్మా నగర్ ప్రాంతానికి చెందిన మిర్యాల కమలమ్మ వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు ఆయన అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉన్నత లక్ష్యాలతో చదువుకుంటే భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదగవచ్చని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే విజయాలు సాధించడం సులభమని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా మంచి ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో పాఠశాల స్థల దాత మిర్యాల యాదగిరి, రాజేందర్, ప్రధానోపాధ్యాయులు ఉష ప్రకాష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నల్లగొండ లో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి:కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



**నల్లగొండ ప్రతినిధి,మే 5,జనంసాక్షి:** నల్గొండ జిల్లాలో రానున్న 15 రోజులు యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులకు ఆదేశించారు.మంగళవారం జిల్లాలో పర్యటించిన ఆయన, చిట్యాల మండలం పెదకాపర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, వట్టిమర్తిలోని రైస్ మిల్లును తనిఖీ చేశారు.అనంతరం సూర్యాపేటకు వెళ్తూ మార్గమధ్యంలో కామినేని ఆస్పత్రి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ధాన్యం కొనుగోలు ఏజెన్సీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్యం సేకరణ పనితీరు బాగున్నప్పటికీ మరింత వేగం పెంచాలని సూచించారు. తక్కువ సేకరణ ఉన్న కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, కొనుగోలు వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.రైతులకు చెల్లింపులు జాప్యం లేకుండా చేయాలని, తూకం, రవాణా, హమాలి, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.రవాణా వాహనాల కేటాయింపును రోజువారీగా సమీక్షించి అవసరమైన చోటుకు తరలించాలని, అవసరమైతే అదనపు వాహనాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. హమాలీల కొరత ఉంటే సమీప ప్రాంతాల నుంచి సమీకరించాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలపై వెంటనే స్పందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం టార్పాలిన్లు సమకూర్చినట్లు, మిల్లర్ల చార్జీలు చెల్లించినట్లు, బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని ముందుగానే ఇచ్చినట్లు తెలిపారు. గన్ని బ్యాగుల కొరత లేకుండా 11 కోట్ల కొత్త గన్ని బ్యాగులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. మిల్లర్లు పూర్తి సహకారం అందించి ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని కోరారు.ఈ రెండు వారాలు కీలకమని, అందరూ సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, రబీ సీజన్‌లో జిల్లాలో 457 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 800 లారీలను కేటాయించి నట్లు, మిల్లుల వద్ద అవసరమైన హమాలీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ధాన్యం సేకరణపై ప్రతిరోజు టెలీ, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్ష నిర్వహిస్తు న్నట్లు చెప్పారు.ఈ సమీక్షలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్‌తో పాటు పౌర సరఫరాలు, ట్రాన్స్పోర్ట్, సహకార, మార్కెటింగ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధితో చిన్నారి ప్రాణాలకు భరోసా

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవ



**భువనగిరి, మే 5 (జనంసాక్షి)** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన బింగి ప్రసాద్?హేమలత దంపతుల కుమార్తె వర్షశ్రీ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి వైద్య ఖర్చుల కోసం అత్యవసరంగా సీఎం సహాయనిధి నుంచి రూ.3.50 లక్షల (ఎల్‌ఓసీ)ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఆపద సమయంలో సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పట్ల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పేదల పాలిట సీఎం సహాయనిధి పెన్నిధిలా మారిందని వారు పేర్కొన్నారు. ఇప్పటివరకు భువనగిరి నియోజకవర్గంలో సుమారు రూ.5 కోట్ల మేర సీఎం సహాయనిధి ద్వారా బాధితులను ఆదుకున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్, గూడూరు సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్, కాకునూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగర చరిత్రలో అతిపెద్ద మౌళిక ప్రాజెక్టులు



- ✧ అభివృద్ధికి కేరాఫ్ మంత్రి తుమ్మల
- ✧ రాష్ట్రంలోనే ఖమ్మం నగరంకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మంత్రి
- ✧ వందల కోట్లతో ఖమ్మం అభివృద్ధి పరుగులు
- ✧ వేసవిలో నీటి ఎద్దడి, కరెంటు కోతలు లేకుండా చేసిన తుమ్మల
- ✧ అభివృద్ధికి మారుపేరుగా తుమ్మల హయాం
- ✧ కేబుల్ బ్రిడ్జి.. కరకట్ట నిర్మాణం
- ✧ మంత్రి తుమ్మల పనితీరుకు నిలువెత్తు నిదర్శనాలు
- ✧ త్రీటౌన్‌లో మీడియా సమావేశంలో నేతల విశ్లేషణ
- ✧ రూ.180 కోట్ల కేబుల్ బ్రిడ్జి పనులు తుదిదశలో 8.5 కి.మీ మున్నేరు ప్రొ-టె-క్షన్ వాల్‌కు భారీ వ్యయం
- ✧ ట్రాఫిక్, వరద సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా అడుగులు
- ✧ వర్షాకాలానికి ముందే పనుల పూర్తి లక్ష్యం
- ✧ ఖమ్మం నగర రూపురేఖలు మారనున్నాయని నేతల అభిప్రాయం

**ఖమ్మం , మే 05 (జనం సాక్షి)**
ఖమ్మం నగర అభివృద్ధి చరిత్రలో కేబుల్ బ్రిడ్జి, మున్నేరు ప్రొ-టె-క్షన్ వాల్ ప్రాజెక్టులు అత్యంత కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని త్రీ టౌన్ కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. త్రీటౌన్ పరిధిలోని కేబుల్ బ్రిడ్జి ఆవరణలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో త్రీ టౌన్ కార్పొరేటర్లు కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, కొప్పెర సరిత ఉపేందర్, తోట ఉమారాణి వీరభద్రం, ధనాల రాధ, డోన్‌వాన్ సరస్వతి రవినాయక్‌లు ఈ అంశాలను వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ స్థాయిలో నిధులు కేటాయించి ఈ ప్రాజెక్టులను చేపట్టడం విశేషమని పేర్కొన్నారు. నగర భవిష్యత్తును మార్చే సామర్థ్యం ఈ ప్రాజెక్టులకు ఉందని వివరించారు. ప్రజల భద్రత, సౌకర్యాల దృష్ట్యా వీటిని అత్యున్నత ప్రాధాన్యంతో అమలు చేస్తున్నట్లు- తెలిపారు. ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఖమ్మం నగరాన్ని ఆధునిక నగరంగా తీర్చిదిద్దడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. అన్ని వర్గాల ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనాలు చేకూరేలా ఈ పనులు చేపట్టినట్లు- తెలిపారు.అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారని వారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మం నగరానికి ప్రత్యేక గుర్తింపు తుమ్మల హయాంలో వచ్చిందని గుర్తు చేశారు. వేల కోట్ల రూపాయలతో ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధిని, త్రీ టౌన్ ప్రాంత అభివృద్ధిని పరుగులు పెట్టించారని అన్నారు.నగరంలో పార్కులు, సీసీ రోడ్లు, ఎటు చూసినా అభివృద్దే కనిపిస్తోందని అది తుమ్మల మార్క్ పాలనకు గుర్తింపు అని అన్నారు. గత హయాంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీని ఖమ్మం నుంచి తరలించాలనే బీఆర్ఎస్ పార్టీ ప్రణాళికలు చేసిందని అటువంటి దశ నుంచి త్రీ టౌన్‌కు ప్రధాన వనరుగా ఉన్న మార్కెట్‌ను అదే ప్రాంతంలో ఉంచి రూ. 150 కోట్లతో మార్కెట్ అభివృద్ధి చేశారని 80వేల బస్తాల కెపాసిటి ఉన్న ఖమ్మం మార్కెట్‌ను 2 లక్షల బస్తాలు నిల్వ ఉంచే స్థాయికి తీసుకొచ్చిన ఘనత తుమ్మల నాగేశ్వరరావుకు చెందుతుందన్నారు. మార్కెట్ చుట్టూ రూ. 14 కోట్లతో 70 అడుగుల రోడ్ల వెడల్పు నిర్మాణం చేపట్టిన ఘనత ఆయనకే చెందుతుందన్నారు. వెనుకబడిన తరగతుల వసతిగృహ నిర్మాణాల కోసం రూ. 9 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారని అన్నారు. రైతులు నగరంలోకి వెళ్ళకుండా నేరుగా మార్కెట్‌కు వచ్చే విధంగా కోట్ల రూపాయలతో రోడ్లను నిర్మించారని గుర్తు చేశారు. సారధీనగర్‌లో రైల్వేఅండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసిన ఘనత తుమ్మలకే చెందుతుందని గుర్తు చేశారు. అమృత్ స్కీం కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మంజూరు చేసి ప్రాజెక్టును ప్రారంభించిన ఘనత ఆయనదేనన్నారు.

**రూ.180 కోట్ల కేబుల్ బ్రిడ్జి :**
ఖమ్మం నగరానికి ప్రతీకగా నిలిచే కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.180 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించబడినట్లు- నాయకులు వివరించారు. సుమారు 300 మీటర్ల పొడవుతో నిర్మితమవుతున్న ఈ బ్రిడ్జి నాలుగు లేన్లతో అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దు కుంటోందని తెలిపారు. ఫుట్‌పాత్‌లు, డివైడర్ వంటి సౌకర్యాలతో ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించేలా రూపకల్పన చేసినట్లు- చెప్పారు. ప్రస్తుతం పనులు తుదిదశకు చేరుకున్నాయని వెల్లడించారు. త్వరలోనే ప్రజలకు అందుబాటు-లోకి తీసుకురానున్నట్లు- తెలిపారు. ట్రాఫిక్ రద్దీ సమస్యను గణనీయంగా తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. నగర సౌందర్యాన్ని పెంచే ప్రతీకాత్మక నిర్మాణంగా ఇది నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే మౌలిక వసతిగా ఈ బ్రిడ్జి నిలవనుందని తెలిపారు.

**మున్నేరు ప్రొ-టె-క్షన్ వాల్ ప్రాముఖ్యత :**
మున్నేరు ప్రొ-టె-క్షన్ వాల్ నిర్మాణం ఖమ్మం నగర భద్రతకు కవచంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. మొత్తం 8.5 కిలోమీటర్ల పొడవున ఈ వాల్ నిర్మాణం కొనసాగుతోందని వివరించారు. వరద ముప్పును తగ్గించడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని తెలిపారు. భారీ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు- వెల్లడించారు. గతంలో వరదల వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును ప్రాధాన్యంతో అమలు చేస్తున్నట్లు- చెప్పారు. వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టు-కున్నట్లు- తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ఇది అత్యంత అవసరమని పేర్కొన్నారు. నగర భద్రతా వ్యవస్థలో ఇది కీలక భాగంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

**వేగంగా సాగుతున్న పనులు :**
కేబుల్ బ్రిడ్జి, మున్నేరు వాల్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో పనులు నిరంతరంగా జరుగుతున్నాయని వివరించారు. పనుల్లో ఎలాంటి ఆలస్యం చోటు-చేసుకోకుండా చర్యలు తీసుకుంటు-న్నట్లు- పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నిర్మాణం కొనసాగుతున్నట్లు- తెలిపారు. అవసరమైన సాంకేతిక సదుపాయాలు వినియోగిస్తున్నట్లు- చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహిస్తున్నట్లు- వెల్లడించారు. పనుల పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు- తెలిపారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయడానికి కట్టు-బడి ఉన్నామని స్పష్టం చేశారు.

**నగరాభివృద్ధికి కొత్త దిశ :**
ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ఖమ్మం నగర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. వరదల నుంచి నగరానికి శాశ్వత రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని వివరించారు. పెట్టు-బడులను ఆకర్షించే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. నగరంలో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. ప్రజలకు సౌకర్యవంతమైన జీవనం అందించడమే లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి దిశగా ఖమ్మం ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులపై మీడియాకు పూర్తి వివరాలు అందించారు. ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించడం తమ బాధ్యత అని తెలిపారు. ఖమ్మం అభివృద్ధికి కట్టు-బడి పనిచేస్తున్నామని నాయకులు స్పష్టం చేశారు.

## యువత హీరో విజయ్ ను ఆదర్శంగా తీసుకోవాలి



**ఖమ్మం, (జనంసాక్షి ):**
తమిళనాడులో సినీ హీరో విజయ్ దళపతి సాధించిన రాజకీయ విజయాన్ని ఆదర్శంగా తీసుకుని, తెలంగాణలో యువత రాజ కీయాల్లో ముందుకు రావాలని బేడ బుడగ జంగాల సేవాసమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎదురు గట్ల చిట్టిమల్లు పిలుపునిచ్చారు. తమిళనాడు ప్రజలు ఆయనను ఘన మెజార్టీతో గెలిపించడం అభినందనీయమని తెలిపారు. తాను 2023లో పాలేరు ఎమ్మెల్యేగా, 2024లో ఖమ్మం ఎంపీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయినా ప్రజాసేవలో కొనసాగుతున్నా నన్నారు. ఏ పార్టీతో పొత్తు లేకుండా స్వతంత్రంగా ముందుకు సాగుతున్నానని, రాబోయే ఎన్నికల్లో విజయ్ దళపతి పార్టీ “విజిల్” గుర్తుపై పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు.




## లక్ష్యంతో చదివితే సత్ఫలితాలు సాధించవచ్చు:ఎంపీడీవో జమలారెడ్డి

**బూర్గంపహాడ్ మే 05 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- చదువు ఏదైనా లక్ష్యంతో చదివితేనే సత్ఫలితాలు వస్తాయని, దీనికి క్రమశిక్షణ తోడైతే సంస్కారం అబ్బుతుందని ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పినపాక పట్టి నగర్ పంచాయతీ కార్యాలయంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచిన సపావట్ కనిష్క ను ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని లు ధారావత్ తేజేశ్వరి, జస్వంత్, ఐశ్వర్య, ఝాన్సీ లను స్థానిక సర్పంచ్ బానోత్ పద్మ, పాలకవర్గ సభ్యులతో కలిసి సన్మానించారుఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోటమళ్ళ వెంకటరమణ, వార్డు సభ్యులు శ్రీను, నల్లగట్ల గీత, భూక్య పద్మ,నిఖిల్, ఫీల్డ్ అసిస్టెంట్ దారావత్ శ్రీను, సెక్రటరీ విజయ్, బానోత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మద్దుకూరులో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం : హాజరుకానున్న అతిరథ మహారథులు

**చంద్రుగొండ, మే 5( జనంసాక్షి):**
చంద్రుగొండ మండల పరిధిలోని మద్దుకూరు గుంపెన పరిధిలోగల నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా నేడు అయ్యప్ప స్వామి వార్ల యంత్ర విగ్రహ జీవ ధ్వజ శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి చంద్రుగొండ మండలం నుండే కాకుండా జిల్లా నలుమూల నుండి వేలాది సంఖ్యలో భక్తులు హాజరు కానుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు గావించి భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి అతిరథ మహారథులు హాజరుగానున్నారు. నేడు ఉదయం తొమ్మిది గంటల 54 నిమిషాలకు మూలా నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశయందు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి వేద విధులైన బ్రాహ్మణోత్తములచే ఘనంగా చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని వేలాది మంది హాజరై విజయ



వంతం చేయవలసిందిగా అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ తెలిపారు.

## చెరువుల మట్టి ఉచితంగా తీసుకెళ్లావచ్చు

### రైతులకు నీటిపారుదల శాఖ సూచన

**పినపాక, మే 05 (జనంసాక్షి):**
తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని చెరువుల నీటి నిలువ సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో చెరువుల్లో పేరుకుపోయిన సారవంతమైన మట్టిని రైతులు తమ వ్యవసాయ పొలాలకు ఉచితంగా తరలించుకోవచ్చని నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఏఈ నరేష్ తెలిపారు. చెరువుల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం ద్వారా చెరువుల లోతు పెరగడంతో పాటు నీటి నిలువ సమాజం మెరుగుపడుతుందని అదే సమయంలో సారవంతమైన ఈ మట్టి వ్యవసాయ భూముల ఉత్పాదకతను పెంచేందుకు రైతులకు ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. ఈ మట్టిని పొలాలకు తరలించుకోవాలనుకునే రైతులు సంబంధిత పినపాక మండల నీటిపారుదల ఆయకట్ట అభివృద్ధి శాఖ కార్యాలయంలో అనుమతులు పొందాల్సి ఉంటుందని సూచించారు. అలాగే వాణిజ్య అవసరాల కోసం మట్టి తరలించాలనుకునేవారు ప్రభుత్వ నిర్దేశించిన రుసుము చెల్లించి సంబంధిత అనుమతులు పొందిన అనంతరం మాత్రమే మట్టి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా చెరువుల నుంచి మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు, కాబట్టి రైతులు వ్యాపారులు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకొని మాత్రమే మట్టి తరలించాల్సిందిగా పినపాక మండల నేటి పారుదల శాఖ ఏఈ నరేష్ విజ్ఞప్తి చేశారు.



# కోతుల బెడద - వీధి కుక్కల బీభత్సం

**○స్కూలుకు వెళ్లే చిన్న పిల్లలు, వృద్ధులు ఈ దాడులకు ప్రధాన బాధితులుగా మారుతున్న తీరు ○కోతుల వల్ల పంట నష్టం మరియు ఇళ్లలోని వస్తువుల ధ్వంసం ○కుక్కల బెడద వల్ల రాత్రి వేళల్లో వాహనదారులు ఎదుర్కొంటున్న ప్రమాదాలు ○ప్రభుత్వం వెంటనే 'మంకీ కేజ్'లు ఏర్పాటు చేయాలని , కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించాలని డిమాండ్**

**భూదాన్ పోచంపల్లి, మే 5 (జనంసాక్షి):** మండలంలోని గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో కోతులు, వీధి కుక్కల సంచారం రోజురోజుకు పెరుగుతూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. అడవుల్లో ఉండాల్సిన జంతువులు నివాస ప్రాంతాల్లోకి చేరి స్థానికుల నిత్యజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఉదయం నడకకు వెళ్లే వృద్ధులు, ఇళ్ల పనుల్లో నిమగ్నమయ్యే గృహిణులు సైతం బయటకు రావడానికి భయపడే పరిస్థితి నెలకొంది.



**కోతుల బెడద**

గ్రామాలు, కాలనీల్లో కోతుల సంచారం అధికమై ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను చెదరగొట్టడం, ఫ్రిజ్‌లను తెరిచి ఆహారాన్ని ధ్వంసం చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. నీటి పైపులు, ఇంటి సామగ్రిని పాడుచేయడం కూడా సాధారణమైంది. చిన్నారులపై దాడులకు వెనుకాడకపోవడం స్థానికులను మరింత భయపెడుతోంది.

**వీధి కుక్కల బీభత్సం**

మరోవైపు వీధుల్లో కుక్కల గుంపులు స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలకు ముప్పుగా మారుతున్నాయి. కుక్కల దాడుల్లో పలువురు గాయపడుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. గత మార్చి నెలలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని తారకరామ నగర్‌లో నాలుగేళ్ల బాలుడిపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో బాలుడు ఒక కన్ను కోల్పోయాడు.

**చికిత్స కేసులు పెరుగుతున్నాయి**

పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదవుతున్న కేసులు పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం, 2025 సంవత్సరంలో 470 కుక్క కాటు కేసులు, 185 కోతి దాడి కేసులు నమోదయ్యాయి. 2026లో ఏప్రిల్ వరకు మాత్రమే 132 కుక్క కాటు కేసులు, 83 కోతి దాడి కేసులు నమోదు కావడం పరిస్థితి వేగంగా విషమిస్తున్నదని సూచిస్తోంది.

**చర్యలు తీసుకోవాలి**

కోతులు, వీధి కుక్కల సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కోతులను అటవీ ప్రాంతాలకు తరలించడం, వీధి కుక్కల సంఖ్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కుక్క కాటు లేదా కోతి దాడి జరిగి నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గాయాన్ని శుభ్రం చేసి రేబీస్ టీకా తీసుకోవాలి. ఆలస్యం చేస్తే ప్రాణాపాయం కలగవచ్చు.

**డా. శ్రీవాణి, మండల వైద్యాధికారిణి**

వీధి కుక్కలతో పాటు కోతుల బెడద రోజురోజు కూ పెరుగుతోంది. గుంపులుగా తిరిగే కుక్కలు చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తుండగా, కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహారం తీసుకెళ్లడం, వస్తువులను ధ్వంసం చేయడం వంటి ఘటనలు పెరిగాయి. ఉదయం, సాయంత్రం బయటకు వెళ్లడానికే భయపడుతున్నాం. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు భద్రత కల్పించాలి.

**గోశిక భానుప్రకాష్, భూదాన్ పోచంపల్లి**

గ్రామాల్లో కోతుల బెడద మరింత తీవ్రంగా మారింది. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్లడమే కాకుండా, నీటి పైపులు, ఇంటి సామగ్రిని ధ్వంసం చేస్తు న్నాయి. ముఖ్యంగా విద్యార్థులు భయంతో వణికిపోతున్నారు. సమస్య మరింత పెరగకముందే అధికారులు స్పందించి కోతులను బంధించి అడవుల్లోకి తరలించాలి.

**బిజిలీ ఎల్లయ్య, భీమనపల్లి గ్రామం**

# కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

## ఐటీసీ యాజమాన్యానికి కార్మిక జేఏసీ రిమైండర్ సమ్మె నోటీస్

**బూర్గంపహాడ్ మే 05 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఏ క్షణమైనా సమ్మెకు సిద్ధంగా ఉన్నామని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, ఎండీ.యాకూబ్పే, ఆకిని సర్వేశ్వరరావు, బల్లెం నాగయ్యలు స్పష్టం చేశారు. మంగళవారం కార్మికుల న్యాయ మైన డిమాండ్ల పరిష్కారం కానిపక్షంలో ఐటీసీ యాజమాన్యం స్పందించాలని రిమైండర్ సమ్మె నోటీసు మరోసారి హెచ్ఎర్కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సమస్యలు, వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలపై ఫిబ్రవరి 11న లేబర్ డిపార్ట్మెంట్కు నోటీసు ఇచ్చామని... అయినప్పటికీ యాజమాన్యం, లేబర్ డిపార్ట్మెంట్ కార్మిక జేఏసీతో ఎలాంటి చర్చలు జరపకుండా 14వ వేతన ఒప్పందం గుర్తింపు సంఘంతో కలిసి



ఏకపక్షంగా చర్చలు జరిపి కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం పూర్తిచేశారని సమాచారం అందిందన్నారు. ఈ వేతన ఒప్పందంలో కార్మికులు అడిగిన డిమాండ్లు పరిష్కరించకుండా సరైన న్యాయం జరగకపోతే జనరల్ బాడీ మీటింగ్ తర్వాత ఏ క్షణమైనా సమ్మెకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని, దీనికి యాజమాన్యం, లేబర్ కమిషనర్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తొలుత 41వ రోజు చేపట్టిన దీక్షలకు బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్రెడ్డి, శ్రమశక్తి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బీఆర్టీయూ అధ్యక్షులు కుందూరు పెద్దిరెడ్డి, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డిలు హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షా కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు, జేఏసీ సభ్యులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# 4వ రోజుకు చేరుకున్న మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

## కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు నాయకులు

**కల్లూరు మే 05(జనంసాక్షి)**




గత తొమ్మిది నెలలుగా పెండింగ్లో ఉన్న మున్సిపల్ కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మున్సిపల్ స్టాప్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. 9 నెలల వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని బిఆర్ఎస్ కౌన్సిలర్లు, పలువురు నాయకులు సందర్శించి సంఘీభావం తెలుపుతూ సమ్మె శిబిరంలో కూర్చున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ , బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు నాయకులు లక్కిలేని రఘు, పెడకంటి రామకృష్ణ ,లు ప్రసంగించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా కూడా కల్లూరు మున్సిపాలిటీ కార్మికులు వేతనాల కోసం నిరవధిక సమ్మె చేయడం దురదృష్టకరమని అన్నారు.. కార్మికులతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, డాక్టర్ లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, ఎండి ఇస్మాయిల్, సయ్యద్ ఆస్మా ఇంతియాజ్, మాజీ జెడ్పిటిసి మేకల కృష్ణ, మైనార్టీ నాయకులు రావుఫ్, కమ్లి, డి నరసింహారావు, రాంబాబు మున్సిపాలిటీ సంఘం నాయకులు ఊడలు కృష్ణమూర్తి కార్యదర్శి వజేర్మియా ఉపాధ్యక్షులు చింతపల్లి శ్రీను, కంభంపాటి కోశాధికారి ప్రకాష్ గొల్లమండల యశోద అంజలి సహాయ కార్యదర్శులు కట్టా నరసింహారావు బాబు గౌడ్, జగతి, మరియమ్మ, లక్ష్మి, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేవారి శాతం పెంచాలి

## ఎంపీడీవో సంకీర్త్

**పినపాక, మే 05(జనం సాక్షి):**





పినపాక మండలంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఎంపీడీవో సంకీర్త్ సూచించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ సెక్రటరీలతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారీగా పనుల్లో పాల్గొనేవారి హాజరు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలు, పనుల ప్రగతి, కార్మికులకు చెల్లింపులు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి, అర్హులైన కార్మికులను ఎక్కువగా భాగస్వామ్యం చేయాలని ఎంపీడీవో సూచించారు. గ్రామ స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ఈ సమావేశానికి డీఎల్పీఓ సుధీర్ కుమార్, ప్రత్యేక అధికారి తాతారావు హాజరై పథకం అమలుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశం ద్వారా ఉపాధి హామీ పనుల మెరుగుదలకు కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశంలోఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీవో వీరభద్ర స్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశాలో పాల్గొన్న ఛాంబర్ చైర్మన్ కంచర్ల భాస్కరావు

**అశ్వరావుపేట మే 5,(జనంసాక్షి):**

ఈరోజు మున్సిపల్ కార్యాలయం కమిషనర్ దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి షాప్ వారు పరిశుభ్రత పాటించాలని, షాపులోని వ్యర్థలు డస్ట్ బిన్ పెట్టుకొని కవర్లు,లేదా సంచుల్లో మూటకట్టి సాయంత్రం షాప్ ముసేప్పుడు బయట పెట్టి వెళ్లాలని చూచించరు. రేపటి నుండి ఏ షాప్ ముందు చేత్త, చెదారం కనిపించిన ఫైన్ వేస్తామని తెలియచేసారు.వేరే వాళ్ళు ఎవరైనా మన షాప్ ముందు చేత్త వేసిన, ఇబ్బంది కలిగించేలాగా వున్నా కమిషనర్ కి తెలియ చేయగలరని తెలిపారు.లోకల్ ఆటోలకు పన్ను రాయితీ ఇవ్వాలని ఛాంబర్ అధ్యక్షులు మున్సిపల్ చెర్మన్ ని కోరడంతో సానుకూలంగా స్పందించి ఈరోజు నుండి లోకల్ ఆటోలో సరుకు తెచ్చిన, తీసుకెళ్లిన మున్సిపల్ పన్ను ఉండదని వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ తరుపున ఇరవై మంది వ్యాపారస్తులు పాల్గొన్నారు.



# 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలి

## రాష్ట్ర ఆహార పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు 48 గంటలలోపు వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయుటకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు.మంగళవారం కలెక్టరేట్ లో జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, పిపిసి కేంద్రాల నిర్వహణ, ధాన్యం నిల్వలు, రవాణా, మిల్లింగ్, సంబంధిత ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అకాల వర్షాలు వస్తున్నందు వలన పిపిసి కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.అందుకు అవసరమైన లారీల కొరత లేకుండా చూసుకోవాలని, అవసరమైతే అదనపు లారీలను ఏర్పాటు చేయాలని సూచించారు.పిపిసి కేంద్రాల నుండి ధాన్యం తరలింపు, ట్యాగింగ్, అప్‌డేట్లు తదితర సమాచారాన్ని రియల్ టైమ్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.జిల్లా కలెక్టర్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కార్యక్రమాల పురోగతిని కమిషనర్ కి వివరించి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను తెలిపారు.జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబు , జిల్లా మేనేజర్ శ్రీధర్ రెడ్డి ప్యాడి కొనుగోలు, నిల్వ, తరలింపు, మిల్లింగ్ ఏర్పాట్లను వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్, జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ కొండలరావు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్, డిఎంఓ నాగేశ్వర శర్మ, తహసిల్దార్ కృష్ణయ్య, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర అక్రమఇసుక దందా నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తుల అరెస్టు



**పెనుబల్లి,మే 5( జనంసాక్షి)** అంతర్రాష్ట్ర అక్రమ ఇసుక దందా నిర్వహిస్తున్న ముగ్గురు ఇసుక దందా గాలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు కల్లూరు ఏసీపి వసుంధర యాదవ్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని కొందరు వ్యక్తులు ఆసరాగా తీసుకొని అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి తరలించి అధిక ధరలకు విక్రయిస్తూధనార్జనే లక్ష్యంగా నేరాలు పాల్పడుతు న్నారని తెలిపారు, ఆంధ్ర నుండి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ ఇక్కడ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న ముగ్గురు నిందుతులను అదుపులోకి తీసుకోని రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. గత నెల 25 న వియం బంజర్ ఎస్సై వెంకటేష్ తన సిబ్బంది కలిసి వియం బంజర రింగ్ సెంటర్ లొ వాహనాలు తనిఖీ లొ పట్టుబడ్డ తిరువూరు వైపు నుండి ఇసుకలోడుతొ వస్తున్న టిప్పర్ లారీని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు.ఇసుక అక్రమ రవాణా మూలాలపై దృష్టి పెట్టి పరారీలో వున్న అసలైన నిందుతులను మంగళవారం పట్టుకొని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. నిందుతులు ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లాకు చెందిన టిప్పర్ డ్రైవర్ పసుపులేటి పవన్ కుమార్, టిప్పర్ ఓనర్ వెల్లంకి త్రినాథ రామ కృష్ణ. మధ్యవర్తి అబ్బూరి రఘు లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు. కల్లూరు డివిజన్లో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ఎలాంటి అక్రమ రవాణాకి ఆస్కారం లేదని పోలీస్ తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. ధనార్ధనె లక్ష్యంగా అక్రమ ఇసుక దందా లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఏసిపి హెచ్చరించారు.



## నిరుపేదలకు లైన్స్ క్లబ్ ఆఫ్ సాయం

**దమ్మపేట మే 5 ( జనంసాక్షి):** ఈరోజు సాయంత్రం 4-30. గంటలకు దమ్మపేటలోని ఫుట్ పాత్ పై వ్యాపారం చేసుకుంటున్న కడు నిరుపేదలకు లయన్స్ క్లబ్ ఆఫ్ దమ్మపేట వారి ఆధ్వర్యంలో 3 పెద్ద గొడుగులు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ దమ్మపేట అధ్యక్షులు శ్రీ అంకత ఉమామహేశ్వరరావు, సెక్రెటరీ, ఒ ఎ అ వేణుగోపాల్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ దారా యుగంధర్ ,లయన్స్ క్లబ్ ట్రెజరర్ పసుమర్తి ముక్తేశ్వరరావు లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కక్కిరాల రమేష్, కక్కిరాల వెంకటేశ్వరరావు, సీనియర్ అడ్వకేట్ ఆడమ్స్, అశ్వరావుపేట లైన్స్ క్లబ్ సభ్యులు ధారా మల్లికార్జునరావు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## గంజాయి లిక్విడ్ పట్టివేత

### కారులో తరలిస్తున్న 12.50 లక్షల విలువ గల లిక్విడ్ గంజాయి స్వాధీనం



**భద్రాచలం మే 05 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్లోని వీరభద్ర ఫంక్షన్ వద్ద పోలీసుల వాహన తనిఖీలలో భాగంగా లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. దీనికి సంబంధించి డి.ఎస్.పి అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సిఐ నాగరాజు వారి సిబ్బంది వీరభద్ర ఫంక్షన్ హాల్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఒక కారు ను ఆపి తనిఖీ చేయగా దానిలో 12.50 లక్షల విలువైన లిక్విడ్ గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన ఒక కారు, ఇద్దరు వ్యక్తులు నాగర్ కర్నూలు జిల్లా తాండూర్ మండలం చెర్ల ఇటిక్యాల గ్రామానికి చెందిన జెసిబి ఆపరేటర్ గా పనిచేస్తున్న నిరుడి సాయిరాం (24), అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్న కందాల కేశవులు (20) గా వివరించారు. నిందితులు హాసిష్ లిక్విడ్ ను ఒడిస్సాలోని కలిమెల నుండి నాగర్ కర్నూల్ కు తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని గంజాయి వంటి అక్రమ రవాణాలు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డి.ఎస్.పి అరుణ్ కుమార్ హెచ్చరించారు. ఇటువంటి అక్రమ రవాణాలు చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎవరికైనా ఇటువంటి సమాచారం తెలిసిన తమకు అందజేయాలని తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు

### అర్హులైన వారికే ప్రాధాన్యం: ఎంపీడీవో జె.మహేష్



**గుర్రంపోడు,మే,5, (జనంసాక్షి)** గుర్రంపోడు మండల పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల ఎంపిక ప్రక్రియకు ఈ నెల 7 ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి జెమహేష్ తెలిపారు. మంగళవారము మండల కేంద్రం లోని ఎంపీడీఓకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ప్రత్యేకంగా మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 7న ఉదయం 11:00 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో హాజరు కావలన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ వెంట విద్యార్హత, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు ఇతర ధృవీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ఎంపికైన లబ్దిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణ సౌకర్యం కల్పించబడుతుందని ఎంపీడీఓ స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

## ఆస్తమా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



**సూర్యాపేట (జనంసాక్షి):** ఆస్తమా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వెన్నెల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నరేష్ మామిడి అన్నారు.జిల్లా కేంద్రంలో మంగళవారం కొత్త బస్టాండ్ వద్ద ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి మాట్లాడారు.ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా ఆస్తమా వ్యాధి పట్ల ఎందరో చనిపోతున్నారని అన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు, పొగ, దుమ్ము దూళి, సిగరెట్ పొగ, కాలుష్యం తదితర కారణాల వల్ల అనేక మంది వ్యాధి బారిన పడు తున్నారని తెలిపారు.చల్లని గాలి లేదా అకస్మాత్తుగా మారే వాతావరణం ఆస్తమా వ్యాధిని పెంచుతుందని తెలిపారు.పండ్లు, కూరగాయలు తీసుకోవడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెన్నెల ఆసుపత్రి డైరెక్టర్ బయ్య దయాకర్, సిబ్బంది రియాజ్, నాగరాజు, శ్రీకాంత్, బాచి, చైతన్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీ

### గ్రామపంచాయతీ నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

**నూతనకల్ మే 5(జనంసాక్షి)** ఉపాధి హామీ కూలీలు సమయపాలన పాటించాలని ఎండ తీవ్రత ఉండటం వలన ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం వరకు పనులు పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సునీత అన్నారు ఈ సందర్భంగా మంగళవారం బక్కహేమ్లాతండ గ్రామపంచాయతీ లో పర్యటించి కూలీలు పనిచేసే ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించారు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కూలీలు సమయపాలన పాటించాలని కూలీలకు సరైన వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు అనంతరం గ్రామపంచాయతీ నర్సరీని పరిశీలించారు ఎండకు మొక్కలు వాడిపోకుండా షెడ్ నెట్ నీరు సరిగా మొక్కలకు పెట్టాలని మొక్కలను పశువులు మేకలు గొర్రెల నుండి సంరక్షించాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాములు సర్పంచ్ గుగులోతు కృష్ణ నాయక్ పంచాయతీ కార్యదర్శి గడ్డమీద శ్రీనాథ్ ఈసీ తదితరులు పాల్గొన్నారు.





## గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ?

**పులిమామిడి గ్రామంలో అవగాహన కార్యక్రమం ఎస్సై సాయి ప్రశాంత్**

**హాలియా ఏప్రిల్ 5 జనంసాక్షి**

మన భద్రత మన చేతిలోనే ఉందని హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ అన్నారు. మంగళవారం నాడు అనుముల మండల పరిధిలోని పులి మామిడి గ్రామంలో జరుగుతున్న చోరీలు, అనుమానాస్పద కదలికలు మరియు ఇతర అనర్థాలను నివారించడానికి సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత అవసరం. గ్రామ భద్రత పెంచడానికి ఇవి ముఖ్య ఆయుధంగా పనిచేస్తాయి.అందుకే, గ్రామసభ్యులందరూ కలిసి సహకరించి, మన ప్రదేశాన్ని సురక్షితంగా మార్చుకుందాం. మన భద్రత మన చేతుల్లోనే ఉంది. అందరం ఐక్యంగా ముందుకు వచ్చి సహకరించాలని అన్నారు గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు.

## మా భూముల మీదుగా 'సీతారామ' పిల్ల కాలువ నిలుపుదల చేయాలి

**డిప్యూటీ తహశీల్దార్ కు వినతి**

**బూర్గంపహాడ్ మే 05 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- మా భూముల మీదుగా సీతారామ ప్రాజెక్టు పిల్ల కాలువలు వెళ్లనీయకుండా నిలుపుదల చేసి తమకు న్యాయం చేయాలని మండల పరిధిలోని వేపలగడ్డ పంచాయతీ గిరిజన రైతులు మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో డీటీ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. జనవరి 2026 నుంచి రైతులకు ఎలాంటి సమాచారం, పీసా చట్టం గ్రామసభ తీర్మానం లేకుండా సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పిల్ల కాలువలు తీయడానికి మా భూముల సర్వే నిర్వహిస్తున్నారని ఆ వినతిలో ఆరోపించారు. ఆ భూముల మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ముందస్తు సమాచారం లేకుండా ఎకరం, అరెకరం మాత్రమే కలిగి ఉన్న భూముల్లో పిల్ల కాలువలు అవసరంలేదని, దీనివల్ల మా భూములకు నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీతారామ కాలువకు భూములు తామే ఇచ్చామని, కిన్నెరసాని కాలువకు సైతం ఇచ్చామని..ఇప్పుడు సీతారామ ప్రాజెక్టు పిల్ల కాలువలు తీస్తే పూర్తిగా భూములు కోల్పోయి రోడ్డున పడతామని, తక్షణమే సర్వేను నిలిపివేసి పిల్లకాలువలు తీయకుండా పీసా చట్టాన్ని గౌరవించి సర్వేను రద్దు చేసి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఆ వినతిలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆదివాసీ మండల నాయకులు మెండి భాస్కర్తో పాటు వేపలగడ్డకు చెందిన గిరిజన రైతులు హోలీ, బద్రు, వీరభద్రం తదితరులు ఉన్నారు.



## ప్రజలకు ఆరోగ్య సేవలు సమర్ధవంతంగా అందించాలి

**జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్**



**హుజూర్ నగర్ రూరల్ మే 05 (జనంసాక్షి):** ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు ప్రతి ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్ కోరారు. మంగళవారం జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రసిద్ లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రత్యేకంగా క్షయ, కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం, హెచ్ పి వి వ్యాక్సిన్,తల్లీబిడ్డల ఆరోగ్యం, టీకాల కార్యక్రమం, నాన్-కమ్యూనికబుల్ వ్యాధుల నియంత్రణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామ స్థాయి వరకు సేవలు అందేలా ఫీల్డ్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్, పద్మ, సూపర్ వైజర్ పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్ ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## తండు సత్యనారాయణ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య**

**నూతనకల్ మే 5 (జనంసాక్షి)**

తాళ్ళసింగారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రిటైర్డ్ ఎంఈఓ తండు సత్యనారాయణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మధ్యాహ్నం చనిపోయారు ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు తండు సత్యనారాయణ ఉపాధ్యాయుడిగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు ఎలా ఎదగాలో మార్గదర్శకుడుగా గ్రామ పౌరులకు సూచించేవారు ఉద్యోగ పదవి విరమణ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి మహిళా రిజర్వేషన్ లో తన సతీమణి తండు సువర్ణ ను సర్పంచిగా గెలిపించుకొని గ్రామ ముఖచిత్రాన్నే మార్చి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు ఇలాంటి గొప్ప మానవతావాది మన మధ్యలో లేకపోవడం ఈ గ్రామానికి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని వారన్నారు వారితో పాటుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి పిఆర్టియు అసోసియేట్ అధ్యక్షులు మహేశ్వరం వెంకన్న సర్పంచ్ జటంగి నాగలక్ష్మి గణేష్ యాదవ్ మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ మట్టపల్లి గంగయ్య యాదవ్ బొడ్డుపల్లి అంజయ్య భూ రెడ్డి సంజీవరెడ్డి జహంగీర్ జటంగి గణేష్ యాదవ్ మూడ్ శంకర్ నాయక్ బద్దం ప్రశాంత్ మేడిపల్లి అశోక్ తదితరులు నివాళులు అర్పించారు.



## గోవిందపురంలో హనుమజయంతికి ఏర్పాట్లు

హుజూర్ నగర్, (జనంసాక్షి): పట్టణంలోని గోవిందపురంలో గల అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కే వెంకటేశ్వర్లు, కే నాగేశ్వరరావు కోరారు. మంగళవారం గోవిందాపురం లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, గంధ సింధూరం, ఆకు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12న హనుమాన్ జయంతి సందర్భంగా దేవాలయంలో గణపతి పూజ, హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు వేలాదిమంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. హనుమ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదానానికి భక్తులు పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ కోలా ఉదయ భాను ఉపేందర్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రంగబట్రాచార్యులు, అమర్నాథ్ రెడ్డి, బండారు శ్రీనివాసు, పోటు ఉపేందర్, జనిగే పిచ్చయ్య, పలనాటి అంజిరెడ్డి, రణబోతు పద్మ రాజశేఖర్ రెడ్డి, గట్టు నాగేశ్వరరావు, తోకల ప్రభాకర్, ఆదినారాయణ, కె.పద్మ, సుభద్ర, దేవిశెట్టి పద్మ, నరసింహారావు, పాల్గొన్నారు.

## సొసైటీ పాలకవర్గం తిరిగి కొనసాగింపు

## చైర్మన్ బిక్కసాని



**బూర్గంపహాడ్ మే 05 (జనంసాక్షి)**

భద్రాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- తెలంగాణ రాష్ట్రంలో గతంలో బాధ్యతలు తీసుకున్న సొసైటీ పాలకవర్గాలు తిరిగి పాలకవర్గాన్ని కొనసాగించాలని ఆదేశించడంతో ప్రభుత్వం చేసిన సూచన మేరకు బూర్గంపహాడ్ మండలంలో పీఏసీఎస్ పాలకవర్గాన్ని తిరిగి కొనసాగించారు. మంగళవారం ఈ మేరకు సొసైటీ చైర్మన్ గా బిక్కసాని శ్రీనివాసరావు పాలకవర్గ సభ్యులతో కలిసి పాలన చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు సొసైటీ ద్వారా అన్ని సదుపాయాలు కల్పించాలని, వ్యవసాయపరంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనవద్దని, కొనుగోలు కేంద్రాల్లో వారికి సకల సదుపాయాలు కల్పించాలని పాలకవర్గానికి, సొసైటీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈవో ప్రసాద్, సిబ్బంది తిరుపతిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన డీఎస్పీ ని కలిసిన బీజేపీ నాయకులు

**భద్రాచలం మే 05 (జనంసాక్షి)**

భద్రాచలం కు నూతన డీఎస్పీ గా నియమితులైన ఎం. అరుణ్ కుమార్ ని మంగళవారం భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, బాధ్యతల స్వీకరణకు అభినందనలు తెలియజేశారు. ప్రాంతంలో చట్టవ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని, సాధారణ ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మారావు, కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రామ్మోహన్ రావు, బోడ సత్యనారాయణ, ముత్యాల చంద్రశేఖర్, ములిశెట్టి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## బంగారు దుకాణాలలో అత్యాధునికమైన సీసీటీవీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలి

**-ప్రజలకు, వ్యాపారాలకు భద్రత కల్పించడంలో పోలీస్ శాఖ అనునిత్యం కృషి**

**-కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు**

**హుజూర్ నగర్, (జనంసాక్షి):**


బంగారు దుకాణాల యజమానులు దుకాణాల నందు అత్యాధునికమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలనీ కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు తెలిపారు. మంగళవారంసర్కిల్ కార్యాలయం నందు పట్టణ బంగారు దుకాణాల అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు మాట్లాడుతూ మన భద్రత మన రక్షణ మన చేతుల్లోనే ఉన్నదని వ్యాపార నిర్వహణకు పటిష్ట రక్షణ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆర్థికపరమైన వ్యాపార సముదాయాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని, రక్షణ చర్యలు సైతం తీసుకునేలా షాప్ యజమానులను మోటివేట్ చేయాలని జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ సూచించారని తెలిపారు. విలువైన ఆభరణాలు సేఫ్ లాకర్లలో ఉంచాలని సేఫ్ లాకర్ లేనట్లయితే వస్తువులు రాత్రిపూట దుకాణంలో ఉంచకూడదని హెచ్చరించారు. ప్రజలకు, వ్యాపారాలకు భద్రత కల్పించడంలో పోలీస్ శాఖ అనునిత్యం కృషి చేస్తుందని, స్వీయ రక్షణ చర్యలు సైతం యజమానులు పాటించాలని కోరారు. దుకాణంలో బంగారం వస్తువులను ప్రదర్శించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో 24 గంటలు పోలీసు బీట్ సిస్టం పెంచడం జరిగినది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బండి మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# శివన్నగూడ కాంగ్రెస్‌లో ముసలం సర్పంచ్‌పై కాంగ్రెస్ నాయకుల ఫైర్

● 'బీఆర్ఎస్‌తో సర్పంచ్ దోస్తీ' అంటూ చిట్యాల రంగారెడ్డి నివాసంలో అత్యవసర భేటీ।

● అసెంబ్లీ ఎన్నికలలో లక్షలు ఖర్చు పెట్టాను తిరిగి ఇవ్వలేదని ఎమ్మెల్యే ను బద్నాం చేస్తున్న సర్పంచ్




**శివన్నగూడ, మర్రిగూడ, మే 5 (జనంసాక్షి)** మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు భగ్గుమన్నాయి. గ్రామ సర్పంచ్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు, మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత చిట్యాల రంగారెడ్డి నివాసంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సర్పంచ్ బీఆర్ఎస్‌తో సాన్నిహిత్యం కొనసాగిస్తున్నారని, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని బద్నాం చేస్తున్నారని కార్యకర్తలు మండిపడ్డారు.

**సమావేశంలో వేడెక్కిన వాతావరణం - సర్పంచ్‌పై ఆరోపణలు**

పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రత్యర్థి బీఆర్ఎస్ కార్యకర్తలతో సర్పంచ్ కలిసి పనిచేస్తున్నారని, గ్రామ అభివృద్ధి కంటే వ్యక్తిగత రాజకీయ లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేకు లక్షల డబ్బులు ఖర్చు చేశాను, ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదు"బి అని సర్పంచ్ గ్రామంలో ప్రచారం చేసుకుంటూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ విషయంపై స్పష్టత కోసం ఎమ్మెల్యేనే నేరుగా అడుగుతాం" అని తేల్చిచెప్పారు.

"రూపాయి కూడా అవినీతి చేయను" అని చెప్పిన సర్పంచ్, సీసీ రోడ్ల పేరుతో ప్రాజెక్టు నుంచి టిప్పర్ల కొద్దీ ఇసుక, కంకరను అక్రమంగా తరలించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. చెరువు వెనుక ముత్యాలమ్మ గుడిని సొంత నిధులతో నిర్మిస్తున్నట్టు ప్రచారం చేసుకుంటూ, అదే ప్రాజెక్టు ఇసుకను వాడుతున్నారని సొంత కార్యకర్తలే



ఆరోపించడం కలకలం రేపుతోంది.

బి"హాస్పిటల్ నిర్మిస్తాను"బి అని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సర్పంచ్, ఇప్పుడు ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పైగా హాస్పిటల్‌ను మరో గ్రామానికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలపై సర్పంచ్ స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు.

**ఉప ఎన్నికల లబ్ది ఆరోపణ:**

మునుగోడు ఉప ఎన్నికల సమయంలో గ్రామం పేరుతో సర్పంచ్ భారీగా లబ్ది పొందారని, మరణించిన వారికి ?10,000 సాయం చేస్తున్నట్టు చెప్పుకోవడం కేవలం ఇమేజ్ కోసమేనని కార్యకర్తలు విమర్శించారు.

**ఎమ్మెల్యేను కలవాలని నిర్ణయం**

సర్పంచ్ వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కార్యకర్తలు, మాజీ నేతలు కలిసి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి గ్రామ రాజకీయ పరిస్థితులపై స్పష్టత తీసుకోవాలని నిర్ణయించారు.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ శివన్నగూడలో కాంగ్రెస్ వర్సెస్ సర్పంచ్‌గా రాజకీయం వేడెక్కింది. ఇసుక అక్రమ రవాణా, హామీల అమలులో విఫలమయ్యారనే ఆరోపణలపై సర్పంచ్ వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఎమ్మెల్యే జోక్యంతో ఈ వివాదం ఎటు మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ వజ్రమ్మ సాగర్, మాజీ సర్పంచ్ చిట్యాల సబితా యాదగిరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ దాసరి మమత గోపాల్, ఊరే రమేష్, వంగల రవీందర్ రెడ్డి, జగత్ రెడ్డి, ఇరుగడిండ్ల సత్తయ్య, బోయిని యాదయ్య, ఎడ్ల యాదయ్య, ముంత యాదయ్య, గుండ్లపల్లి దశరథ, భాస్కర్, గోపిశెట్టి వెంకటేష్, చిలుకూరి యాదయ్య, శ్రీకాంత్, సాంబశివతో పాటు సుమారు 80 మంది ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు సైరెడ్డి వీరారెడ్డి

**నూతనకల్ మే05 (జనంసాక్షి)**

టాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సై రెడ్డి వీరారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టాక్టర్ యూనియన్ సభ్యులు మంగళవారం తెలిపారు ఉపాధ్యక్షునిగా బొజ్జ మహేష్ కార్యదర్శిగా సాబది ఉపేందర్ రెడ్డి లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు తమ ఎన్నికలకు సహకరించిన యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో జక్కుల రవి వెంకట్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముత్యంరెడ్డి వెంకన్న సుధీర్ రెడ్డి ఉప్పలయ్య ఉపేందర్ లక్ష్మణ్ సతీష్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేరు కులానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి

**చింతపల్లి, మే 05(జనంసాక్షి)**



మేరు కులానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు రేణుకుంట్ల వెంకటయ్య అన్నారు.మేరు సంఘం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ స్పందించింది. డీ-నోట ిఫైడ్ ట్రైబ్స్ (డీఎన్‌టీలుగా) పరిధిలో 51 కులాల నోటిఫై కులాలు, ఉపకులాల పేర్ల మార్పిడి విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఏకీభవిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు..ఈ సందర్భంగా మేరు సంఘం నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు రేణుకుంట్ల వెంకటయ్య మాట్లాడుతూ, కులాల జాబితాలో తమ కులానికి సంబంధించిన "మేర (చిపోలు)" బీసీ-డి నంబర్ 5 ఉపకులంగా "మేరు" అనే పదాన్ని చేర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు తొమ్మిది లక్షల పైచిలుకు మేరు కులస్తులు ఉన్నారని, వారి నిజమైన సంఖ్యను గుర్తించి సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కబడ్డీ వేసవిశిక్షణా ప్రారంభం



**కనగల్లు, మే 5 (జనంసాక్షి)**

మే 5 నుంచి జూన్ 5 వరకు నిర్వహించే కబడ్డీ వేసవి శిక్షణ సెంటర్ ను ఎంపీడీవో ఏ వేదా రక్షిత మంగళవారం కనగల్ హైస్కూల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కబడ్డీ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కబడ్డీ పోటీలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురలీధర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీరబాబు, పిడి నర్సిరెడ్డి, జానయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మొహమ్మద్ అబెద్ అలీ హైదర్ నియామకం



**భువనగిరి, మే 5 (జనంసాక్షి)**

తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన మొహమ్మద్ అబెద్ అలీ హైదర్‌ను తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించింది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని సంఘం వర్గాలు వెల్లడించాయి.2009లో ప్రారంభమైన మలిదశ తెలంగాణ ఉద్యమంలో అబెద్ అలీ హైదర్ కీలక పాత్ర పోషిస్తూ, అన్ని వర్గాలను ఏకం చేయడంలో విశేష కృషి చేశారు. సీమాంధ్ర పార్టీల రాజకీయ కుయుక్తులను ఎదుర్కొంటూ యువతను ఉద్యమం వైపు దారి మళ్లించిన నాయకుడిగా గుర్తింపు పొందారు.ఆయన కృషిని గుర్తిస్తూ ఈ బాధ్యతలు అప్పగించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## గుండెపోటుతో మహిళ మృతి



**తుంగతుర్తి, మే 5,(జనంసాక్షి):** మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామంలో గుండెపోటు తో మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాసరి సరోజ (53) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుండెపోటు తో మృతి చెందింది. మృతురాలికి భర్త వీరసోములు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఆమె మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఘనంగా కోట మైసమ్మ అమ్మవారి 8వ వార్షికోత్సవ జాతర మహోత్సవం



**చింతలపాలెం(జనంసాక్షి)**

సూర్యాపేట జిల్లా, చింతలపాలెం మండలం, దొండపాడు గ్రామం లో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ కోట మైసమ్మ అమ్మవారి 8వ వార్షికోత్సవం సందర్భంగా 05-05-2026 తేదీన మంగళవారం ఉదయం 9 గంటలకు గ్రామ ఊరేగింపు లతో అమ్మవారికి జల బిందెలు, పంచామృత అభిషేకం అమ్మవారికి, పోతురాజు స్వామికి ప్రత్యేక అలంకరణ సాయం త్రం 6:30 నిమిషములకు మహిళలకు ప్రత్యేక కుంకుమ అర్చన పూజ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, పాలక మండలి సభ్యులు, ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కో ఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య..

**యాదగిరిగుట్ట మే 5 (జనంసాక్షి)**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ లో నలుగురు కో ఆప్షన్స్ సభ్యుల ఎన్నిక, ప్రమాణస్వీకారం కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరయ్యారు.. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన యాదగిరిగుట్ట పట్టణంలో గౌలికార్ అరుణ, సయ్యద్ రహిమా, బండి జంగమ్మ, షరీఫ్ కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన వారికి ధ్రువపత్రాలను అందజేశారు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.



# ప్రభుత్వ నిర్లక్ష్యం రైతన్నకు తీవ్రనష్టం : బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు



**వలిగొండ ,మే 5 (జనంసాక్షి)**
మండలంలోని అన్ని ఐకెపి, పిఎసిఎస్సి సెంటర్లలో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై రైతు పండించిన ధాన్యాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కొనుగోలు చేయకుండా అనేక ఇబ్బందులకు రైతులను గురిచేస్తూ, మిల్లర్లతో కుమ్మక్కై తరుగు పేరుతో, తేమ పేరుతో, లారీలను మిల్లర్లు అన్లోడింగ్ చేయకపోవడంతో లారీలవారు రైతుల వద్ద వెయిటింగ్ చార్జి వసూలు చేయడం జరుగుతుందని వారు తెలియజేశారు. అదేవిధంగా ప్రతి ఐకెపి సెంటర్లో అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా తాగునీటి సౌకర్యం, రైతులకు సేద తీర్చుకోవడానికి టెంట్లు ఏర్పాట్లు, చేయాలని రైతు పండించిన ధాన్యాన్ని వర్షాల భారీ నుండి కాపాడుకోవడానికి టార్ఫిన్ కవర్లు పంపిణీ చేయాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. లేని ఎడల ఈ రాష్ట్ర ప్రభుత్వ లో ఉన్నటువంటి ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ గ్రామ గ్రామాన రైతులతో పాటు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అడ్డుకుంటారని వారు హెచ్చరించారు. అదేవిధంగా వలిగొండ పట్టణానికి చెందినటువంటి స్థానిక ఎమ్మెల్యే తన మండలంలో ఎలాంటి సందర్శన లేకుండా మీడియా ముఖంగా మా ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తుందని గొప్పలు చెప్పుకోవడం జరుగుతుంది. ఈ కాంగ్రెస్ నాయకులకు సొల్లు సప్పుడే తప్ప, పనులు మాత్రం ఆచరణలో ఎక్కడ చేయరని వారు ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతు పండించిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేయించి , అన్లోడింగ్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాది రెడ్డి , బిజెపి జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ, అశోక్ రెడ్డి, రాములు, మంద నరసింహ,శ్రీనివాస్, పద్మా రెడ్డి, రామ నర్సు,జనార్దన్ రెడ్డి, మండల పదాధికారులు నాగరాజు రంజిత్ రెడ్డి, లింగస్వామి గౌడ్, దయాకర్, నరేందర్ రెడ్డి, వెంకటేశం, అనిల్ ,నరేష్, రామచంద్రం, శ్రీనివాస్, వార్డ్ మెంబర్ అరుణ్, మచ్చ గిరి, మహేష్,మురళి, కిట్టు, రాములు, నరసింహ, రాజేశ్వర చారి, రమేష్, లింగస్వామి, కీర్తి వెంకటేశం, దెయ్యాల వెంకటేష్, గోవర్ధన్ చారి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్న పదవ తరగతి విద్యార్థులు

**చింతపల్లి, మే 05(జనంసాక్షి):** చింతపల్లి మండలంలో విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకుని విశిష్ట ఫలితాలు సాధించారు. మండలానికి గౌరవం తీసుకువచ్చిన ఈ విజయాలు స్థానిక విద్యా వర్గాల్లో ఆనందాన్ని నింపాయి.జడ్పీహెచ్ఎస్ పి నగర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎల్. భవాని 570 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. అదే విధంగా జడ్పీహెచ్ఎస్ కుర్మేడు పాఠశాల విద్యార్థిని జి. అలేఖ్య 564 మార్కులు, జడ్పీహెచ్ఎస్ గడియా గౌరారం పాఠశాల విద్యార్థిని మేఘన 561 మార్కులు సాధించి మెరిశారు.ఈ ముగ్గురు విద్యార్థినులు తమ అద్భుత ప్రతిభకు గుర్తింపుగా గౌరవ కలెక్టర్ బి. చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు.వారి విజయంపై చింతపల్లి మండల విద్యా అధికారి (ఎంఈఓ) అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని పాఠ శాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థినులను హృదయపూర్వకం గా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంజయ్యతో పాటు జడ్పీహెచ్ఎస్ కురుమేడు ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, విటీ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణమ్మ పాల్గొన్నారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లి దండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అధికారులు పేర్కొన్నారు..

# విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడానికి ప్రణాళికతో ముందుకెళ్తాం



**కనగల్లు, మే 5 (జనంసాక్షి)**
ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడానికి ప్రణాళి కతో ముందుకెళ్తామని జిల్లా కామన్ బోర్డ్ సెక్రటరీ కొమ్ము శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల పదవ తరగతిలో కనగల్ హైస్కూల్లో 519 మార్కులతో పాఠశాల నుంచిప్రథమ స్థానంలో ఉన్న కోరే మమతను అభినందించి మెమోటోను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశా లలో అన్ని వసతులను ప్రభుత్వం కల్పించడంతో పాటు ప్రతిభావంతులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన జరిపించడం జరుగుతుందని గుర్తు చేశారు. జాతీయస్థాయి పోటి పరీక్షలు నీట్, ట్రిబుల్ ఐటీ లకు పదవ తరగతి నుంచి ప్రతి సబ్జెక్టులో మెలుకులతో కూడిన విద్యను నేర్పించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు బోధించే ప్రతి పాఠ్యాంశంపై విద్యార్థులు శ్రద్ధతో అర్థం చేసుకొని ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షల లో నూటికి నూరు శాతం మార్కులు సాధించేలా పట్టు దలతో ముందుకు వెళ్లాల న్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రణాళికబద్ధంగా పాఠాలను బోధించడం జరుగుతుందని జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సృజనా కుమారి తెలియజేశారు. అనంతరం నేషనల్ మినిమం కామన్ మెరిట్ స్కాలర్షిప్ కింద ఎంపికైన రాయల చందన సాయి ని శాలువాతో సన్మానించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలతో పటు బడి మానేసిన పిల్లలను గుర్తించి బడికి పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతూ ఉపాధ్యాయులు కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్, ఉపాధ్యాయులు ఆరూ రి జానయ్య, పిడికె నర్సిరెడ్డి, వింజమూరు శ్రీనివాస్, కర్ణాకర్, మాధవి లత, సాజిద్, సఫియా బేగం, జీనత్, అరుణ, పందిరి శ్రీనివాస్, సిఆర్పి పగిడిపాటి ప్రవీణ్ వార్డు సభ్యులు పందుల రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మిక, రైతాంగ పోరాటాలను తీవ్రం చేద్దాం



**భూదాన్ పోచంపల్లి, మే 5 (జనంసాక్షి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలను తీవ్రతరం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి పిలుపునిచ్చారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం భూదాన్ పోచంపల్లి పట్టణం, దంతూరు గ్రామాల్లో 140వ మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోచంపల్లిలో పట్టణ కార్యదర్శి పగడాల శివ, దంతూరులో గ్రామ కార్యదర్శి గోరుగంటి ముత్యాలు జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, కార్మిక చట్టాల రద్దు, లేబర్ కోడ్ల అమలు ద్వారా శ్రమదోపిడీ పెరుగుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్. జనార్ధన్, ఆర్. సీత, కళ్లెపు అడివయ్య, చిరబోయిన కొమురయ్య, వంగాల నరసింహారెడ్డి, ఉచ్చంతల మల్లేష్, పోతగల్ల నరసింహ, కొత్త బాబు, రచ్చ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మోతిలాల్



**పాలక వీడు ( జనంసాక్షి ) :**
సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గా పాలకవీడు మండలం బెట్టేతండాకు చెందిన మాలోతు మోతిలాల్ నాయక్ ను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు.మోతిలాల్ నాయక్ పాలకవీడు మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ ల సిఫారసు మేరకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో నియామకం జరిగింది. మంత్రి ఉత్తమ్ కు ప్రధాన అనుచరుడిగా పనిచేస్తూ ఒక మారు బెట్టే తండా గ్రామ సర్పంచిగా,బెట్టేతండా ఫారెస్ట్ చైర్మన్ గా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పనిచేశారు. అంతేకాకుండా ఆయన సతీమణి మాలోతు బుజ్జి మోతిలాల్ ను జడ్పిటిసిగా గెలిపించారు. ప్రస్తుతం ఆయన సతీమణి బెట్టే తండా సర్పంచిగా పనిచేస్తున్నారు. ఎన్నికలు ఏవైనా ఎప్పుడైనా పాలకవీడు మండలంలో కాంగ్రెస్ పార్టీకి మూల స్తంభంగా నిలబడి పార్టీని విజయ పదంలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సామాన్య గిరిజన కుటుంబం నుంచి వచ్చిన మోతిలాల్ స్వచ్ఛందంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారు. కార్యకర్తల కు నేనున్నానని భరోసా కల్పిస్తున్నారు. పార్టీ పట్ల అంకిత భావం ఆయన చూపిస్తున్న చొరవకు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. ఈ సందర్భంగా మోతిలాల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతికి, తనను నియమించిన డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య లకు కృతజ్ఞతలు తెలిపారు. మోతిలాల్ నియామకం పట్ల పాలకవీడు, నేరేడుచర్ల మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

# మోత్కూర్ మార్కెట్ యార్డ్‌లో రైతుల సమస్యలపై బిఆర్ఎస్ ధర్నా



**మోత్కూర్ మే 5 (జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉన్న వడ్లను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సంప్రదించి సమస్యల పరిష్కారం కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నెల రోజులకు పైగా కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటికీ తూకాలు వేయడంలో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దళారులకు లాభం చేకూరే విధంగా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అరకొరగా జరుగుతున్న కొనుగోళ్లలో 40 కిలోల తూకానికి 2-3 కిలోల వరకు 'తరుగు' పేరుతో కట్టింగ్ చేస్తూ రైతులను నష్టపరుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పెద్దలు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భువనగిరి దారిపై మార్కెట్ యార్డ్ ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. వర్షాలు ప్రారంభమయ్యేలోపు ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొని అప్పులపాలు అవుతారని హెచ్చరించారు. వెంటనే తరుగు పేరుతో కట్టింగ్ చేయకుండా పూర్తి తూకంతో కొనుగోళ్లు నిర్వహించాలని, తూకం వేసిన వడ్లను ఆలస్యం చేయకుండా వెంటనే మార్కెట్ నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, పట్టణ అధ్యక్షులు జంగ శ్రీను, మాజీ మార్కెట్ చైర్మన్లు కొణతం యాకుబ్ రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, మాజీ రైతుబంధు సమితి మండల అధ్యక్షులు కొండ సోమల్లు, కౌన్సిలర్ సుల్తాన్ స్వామి, డీవీఎంఎస్ జిల్లా నాయకులు దాసరి తిరుమలేష్, మాజీ ఎంపీటీసీ పానుగుల్ల విష్ణుమూర్తి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో తాగునీటి కష్టాలు.. నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు

- ఆరు సంపులకు గాను కేవలం రెండు సంపుల ద్వారానే మిషన్ భగీరథ నీరు సరఫరా
- మిషన్ భగీరథ నీరు రాక గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులు
- తక్షణమే సంపులు మర్మతులు చేయాలి
- కోదండపురం మిషన్ భగీరథ నీటి సరఫరా సంపులను పరిశీలించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

## దేవరకొండ మాజీ ఎమ్మెల్యే ధ్వజం"



**పి.ఏ.పల్లి,మే 05 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం,అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.మంగళవారం నాడు కోదండపురం మిషన్ భగీరథ నీటి సరఫరా సంపులను,స్థానిక నాయకులతో కలిసి దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు సంపులకు గాను కేవలం రెండు సంపుల ద్వారా మాత్రమే నీరు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు.మిషన్ భగీరథ నీరు రాక గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు.తక్షణమే సంపులు మర్మతులు చేయాలని ఆయన ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. ఆయన వెంట బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్,ఉమ్మడి పి.ఏ.పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎల్గూరి వల్లపురెడ్డి,సర్పంచ్లు కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,ఆడేపు నాగేష్, కిషన్ నాయక్, అనిత రాజేందర్ రెడ్డి,రాయనబోయిన శ్రీను, బిఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి మహేందర్, మండల నాయకులు మాద సుధాకర్ గౌడ్, తోటకూరి పరమేష్,అర్వపల్లి నరసింహ, గోలి గిరి,పేర్ల రవి, ధర్మాపురం కోటేష్,కర్నాటి రవి, రమావత్ శ్రీను,సత్యం,మణిపాల్,తాళ్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.



# చదువుల తల్లికి.. డాక్టర్ పట్టా..!

## కృషి,పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించిన పూజిత

**పి.ఏ.పల్లి,మే 05(జనంసాక్షి)** అత్యంత పేదరికంలో పుట్టి పెరిగి ఎర్ర పూజిత ఎంబిబిఎస్ పూర్తిచేసి డాక్టర్ కోర్సు పట్టా అందుకున్నారు.పి.ఏ.పల్లి మండల కేంద్రానికి చెందిన ఎర్ర యాదగిరి- నర్సమ్మ దంపతుల కుమార్తె పూజిత మొదటి నుండి చదువులో ముందంజలో ఉండి తండ్రి మరణించిన డాక్టర్ కావాలని ఆశయంతో ప్రభుత్వ కోటాలో సీటు సాధించి ఉస్మానియా యందు డాక్టర్ కోర్సు పూర్తి చేసింది.పదవ తరగతిలో- 968 మార్కులు సాధించి 9.5 జిపిఏ రాగ,ఇంటర్ గురుకుల కళాశాల యందు చదివి నీట్ యందు ఆల్ ఇండియా లో 61వేల ర్యాంక్,స్టేట్ లో 1514 ర్యాంకుతో ఉస్మానియా మెడికల్ కాలేజీ యందు సీటు పొందింది.శనివారం రాత్రి ఎంబీబీఎస్ పూర్తి అయిన సందర్భంగా ఉస్మానియాలో డాక్టర్ పట్టా పొందింది.మారుమూల గ్రామానికి చెంది,అత్యంత పేదరికంలో ఉన్న పూజిత డాక్టర్ పట్టా పొందడం పట్ల తల్లి,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

- కాంటా వేసిన ధాన్యాన్ని త్వరగతిన మిల్లుకు తరలించాలి
- పి.ఏ.పల్లి సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి



**పి.ఏ.పల్లి,మే 05(జనంసాక్షి):** పి.ఏ.పల్లి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ యందు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం నాడు స్థానిక సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్నటువంటి సమస్యలు,మౌలిక వసతుల ఏర్పాటు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 తేమ శాతం వచ్చినటువంటి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఫోన్ యందు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం సీఈవో మద్దిమడుగు ప్రభాకర్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో పి.ఏ.పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్షిత రెడ్డి,సిబ్బంది కొండమీది బిక్షం,పంకేష్,ఘనపురం కొండల్,నారాయణదాసు అర్జున్,రైతులు పిల్లి కృష్ణయ్య,రఘుమారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా చలసాని శ్రీనివాసరావు



**నేరేడుచర్ల (జనంసాక్షి)** జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన చలసాని శ్రీనివాసరావును టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు, చలసాని శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులు ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య ప్రతిపాదనతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు, శ్రీనివాసరావు గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, చిల్లేపల్లి సహకార సంఘం చైర్మన్ గా పనిచేశారు, ప్రస్తుతం ఆయన సతీమణి చలసాని మంజుల మండలంలోని కల్లూరు గ్రామ సర్పంచ్ గా పనిచేస్తున్నారు, ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉపాధ్యక్షుడిగా నియమించినందును రానున్న స్థానిక సంస్థల ఎన్నికల తో పాటు భవిష్యత్తు లో జరగ నున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా కృషిచేసి పథకాలను ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందడానికి పాటుపడతానని పేర్కొన్నారు, తన నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి, మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు, ఆయన నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉపాధి హామి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**పి.ఏ.పల్లి,మే 05(జనంసాక్షి)** పి.ఏ.పల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం యందు పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు స్థానిక సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి వేసవికాలం దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లను మంగళవారం నాడు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడం వలన వడదెబ్బ తగలకుండా ఉపాధి హామీ కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.పని ప్రదేశంలో మంచినీరు,నీడ,ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించడం తప్పనిసరి అని,అది అధికారుల బాధ్యత అని ఉపాధి హామీ కూలీలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అక్షిత,ఫీల్డ్ అసిస్టెంట్ నగేష్, గ్రామపంచాయతీ సిబ్బంది శివ,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# పాలడుగు సర్పంచ్‌పై బిఆర్ఎస్ నాయకుల విమర్శలు



**మోత్కూరు మే 5 (జనంసాక్షి)** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన సర్పంచ్ అంతటి భగవత్ గౌడ్‌పై బిఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో బిఆర్ఎస్ పార్టీ ఆయనను ఆదరించి, తన కొడుకు మరిపెల్లి శేఖర్‌కు వచ్చిన టికెట్‌ను కూడా వదులుకొని, 168 ఓట్ల మెజార్టీతో సర్పంచ్ పదవిని అందజేసిందని వారు పేర్కొన్నారు. అలాంటి పార్టీని నమ్మించి, ప్రస్తుతం మళ్లీ టికెట్ ఇవ్వని కాంగ్రెస్ పార్టీలో చేరడం మోసపూరిత రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. ఇలాంటి నాయకులను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ శాఖ అధ్యక్షులు మర్రిపల్లి చంద్రయ్య, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి అంజయ్య, బోడిగ మల్లేష్, కొంపల్లి మల్లేష్ తదితరులు మీడియాకు వెల్లడించారు.

# నిరుపేదల ముఖంలో చిరునవ్వు చూడడమే గాంధీజీ ఫౌండేషన్ లక్ష్యం

## 29వ నెల నిత్యావసర సరుకులను పంపిణీ



**చండూరు, మే 5 (జనంసాక్షి)** ప్రతినెల 30 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాస్ దంపతులు 2024వ సంవత్సరం జనవరి నెల ఒకటో తేదీన ప్రారంభించిన గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ" కార్యక్రమం మంగళవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు 29వ నెల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, అరుణ దంపతులు మాట్లాడుతూ మా జీవితం ఉన్నంతవరకు గాంధీజీ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీ తో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ, సమాజంలో ఆదర్శవంతంగా జీవిస్తామని, ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాక వారి ముఖంలో చిరునవ్వు చూడడమే గాంధీజీ ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. గాంధీజీ ఫౌండేషన్ పేదల పక్షపాతి అని, ప్రాణం ఉన్నంతవరకు నిరుపేదలకు సేవ చేస్తూనే ఉంటామని, పేదలకు సేవ చేయడంలో ఉన్న ఆనందం మరి ఎక్కడ లభించదని అన్నారు.మా గాంధీజీ విద్యాసంస్థల ద్వారా తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు చాలా తక్కువ ఫీజులతో విద్యనందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, గాంధీజీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ పులిపాటి రాధిక, చిలుకూరి రామేశ్వరి, బోడ యాదయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్,గోపి తదితరులు పాల్గొన్నారు.

# వైరా లో రైతు వారోత్సవం

## వ్యవసాయ శాఖ- ఉద్యాన శాఖ రైతు అవగాహన సదస్సు




**వైరా జనంసాక్షి**
మే 5న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ –ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల ప్రాధాన్యం మరియు ఆదాయ వృద్ధి అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఈ సదస్సులో ముఖ్యంగా ఉద్యాన పంటల సాగు విస్తరణ, ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహం, అలాగే వరి, పత్తి, మిరప, మొక్కజొన్న వంటి సాంప్రదాయక పంటలకు ప్రత్యామ్నాయంగా అధిక లాభదాయకమైన పంటలపై రైతులకు మార్గనిర్దేశం చేయబడింది. ఆయిల్ పామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం సాధ్యమవుతుందని, అంతర పంటల ద్వారా అదనపు లాభాలు పొందవచ్చని అధికారులు వివరించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్తలు పావని మరియు ఫణిశ్రీ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలోని వాతావరణం మరియు నేల పరిస్థితులు ఆయిల్ పామ్ మరియు మల్బరీ సాగుకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున ఈ పంటలను సాగు చేసి లాభాలను పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సాంకేతిక సహాయం మరియు మార్కెటింగ్ మద్దతును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కాపా చంద్రకళ మాట్లాడుతూ, సాంప్రదాయక పంటలపై ఆధారపడటం వల్ల రైతుల ఆదాయం పరిమితమవుతోందని, కాబట్టి ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పు దినుసులు, నూనె గింజల పంటల సాగు వైపు రైతులను మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పంటలు మార్కెట్‌లో మంచి డిమాండ్ కలిగి ఉండటంతో పాటు అధిక లాభాలను అందిస్తాయని ఆమె తెలిపారు. వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుతూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఇచ్చే ఉద్యాన పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్ వంటి పంటలు ఒకసారి నాటిన తరువాత 30 నుండి 40 సంవత్సరాల వరకు స్థిరమైన దిగుబడిని ఇస్తాయని, ఇది రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని వివరించారు. అలాగే ఆధునిక సాగు సాంకేతికతలు, డ్రిప్ సించాయన విధానాలు మరియు సమర్థవంతమైన పంట నిర్వహణ పద్ధతులపై రైతులకు వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరామ్ నాయక్, పట్టు పరిశ్రమ డీడీ ముత్యాలు, వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణ శ్రీ,వైరా మండల వ్యవసాయ అధికారి మాయన మంజూఖాన్ గారు,ఏన్కూర్ నరసింహ రావు గారు, సింగరేణి బి అశోక్ గారు ఉద్యాన శాఖ సిబ్బంది, వ్యవసాయ విస్తరణాధికారులు సపవత్ సైదులు, మెడ రాజేష్ వాసంతి, వెంకట నర్సయ్య, కీర్తి, సింగరేణి వ్యవసాయ విస్తరణ అధికారులు ఉద్యాన క్షేత్ర సిబ్బంది, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు మరియు వారి సిబ్బంది పాల్గొని రైతులకు అవసరమైన మార్గనిర్దేశం చేశారు.

# విద్యా స్వేచ్ఛపై దాడులను ఖండించాలి



**ఖమ్మం, మే 5, (జనంసాక్షి) :** నగరంలోని సుందరయ్య భవనంలో భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. నాటక విభాగానికి చెందిన విద్యార్థులు తమ పాఠ్య కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన "హోలీ" నాటకాన్ని అడ్డుకునేందుకు కొందరు కార్యకర్తలు దాడికి దిగడం ప్రజాస్వామ్యంపై దాడిగా పేర్కొన్నారు. మే 3న నాటకం అనంతరం విద్యార్థులను బెదిరించడం, మరుసటి రోజు ప్రదర్శనను అడ్డుకుంటామని హెచ్చరించడం తీవ్రంగా తప్పుబట్టారు. మే 4న నాటకాన్ని చూడడానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరైన సమయంలో ముందుగా ప్రణాళికతో వచ్చిన గుంపులు రాళ్లు, కర్రలతో దాడి చేసి హింసకు పాల్పడ్డారని చెప్పారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడగా, కొందరు నాయకులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఎన్నికైన విద్యార్థి సంఘ సభ్యులే ఈ దాడులకు నాయకత్వం వహించడం బాధాకరమన్నారు. విద్యార్థుల హక్కులను కాపాడాల్సిన వారు హింసకు దిగడం సరైంది కాదని విమర్శించారు. హింసాత్మక నినాదాలు చేయడం, అధ్యాపకులను, విద్యార్థులను భయపెట్టడం అసహ్యకరమని అన్నారు. ఒక విద్యా కార్యక్రమాన్ని మతభావాలను దెబ్బతీస్తోందనే పేరుతో అడ్డుకోవడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వహించే కార్యక్రమాలకు కూడా అడ్డంకులు సృష్టించడం ప్రమాదకరమని చెప్పారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, గాయపడిన వారికి వైద్య సహాయం అందించాలని, విద్యార్థుల భద్రతకు విశ్వవిద్యాలయం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యా స్వేచ్ఛను కాపాడేందుకు స్పష్టమైన చర్యలు అవసరమన్నారు. ప్రజాస్వామ్య భావాలు కలిగినవారు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి హింస, ద్వేషాలను ఎదిరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వంకాయల రాజు, ఉపాధ్యక్షురాలు సంగీత, సభ్యులు సుశాంత్, భాను, శ్రీకర్, త్రినాథ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోలేటి వెంకటకృష్ణ వైద్యం కోసం

## 5వేలు ఆర్థిక సహాయం అందజేత



**కల్లూరు, మే 5 (జనం సాక్షి)** అనారోగ్యంతో బాధపడుతూ వైద్య సేవల కోసం ఆర్థిక స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న శాంతినగర్ కాలనీకి చెందిన కోలేటి వెంకటకృష్ణకు మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు వైద్య సేవలు నిమిత్తం ఐదు వేల రూపాయలను ఆర్థిక సహాయం అందించిదాతృత్వము చాటుకున్నారు. కోలేటి వెంకటకృష్ణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందాడు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రయాణ ఖర్చులు లేక కల్లూరు లోని తన స్వగృహం వద్ద ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం తెలుసు కొన్న కొత్తపల్లి వెంకటేశ్వర్లు రూ.5 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ పలు సామాజిక ప్రజాసేవా కార్యక్రమాలు చేపడుతూ మానవత్వాన్ని చాటుతున్న కొత్తపల్లి వెంకటేశ్వర్లు ను ఆదర్శంగా తీసుకొని యువత ప్రేరణగా నిలవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

తాత గుడి సెంటర్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు

**భద్రాచలం మే 05 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని తాత గుడి సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమంత్ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. అందులో భాగంగా ఈనెల 12 వ తారీఖున జరగనున్న హనుమంతు జయంతి కి వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం, గురువారం శ్రీ రామభక్త భజన బృందం వారిచే సుందరకాండ పారాయణం, శ్రీరామ భక్త ఆంజనేయ గ్రూపు ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం జరుగుతుందని తెలిపారు. శనివారం 108 సార్లు హనుమాన్ చాలీసా ఆది, సోమ, మంగళ వారాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కరుణాకటాక్షాలు భక్తులు పొందాలని ఆలయ అర్చకులు కిరణ్ శాస్త్రి, పవన్, ప్రోగ్రామింగ్ ఇన్చార్జి గంటా కృష్ణ వివరించారు. అదేవిధంగా హనుమంత జయంతి పురస్కరించుకుని పెద్ద ఎత్తున మహాదానం జరుగుతుందని ఆలయ కమిటీ బాధ్యులు తోట శేషు, పోతుల రమణ, కటుకూరి హరిబాబు, ఎన్ శ్రీనివాస్, గుడుమాసు లక్ష్మణ కుమార్ లు తెలిపారు. స్వామివారి కార్యక్రమాల సందర్భంగా అదే రోజ సాయంత్రం భద్రాచల పురవీధులలో ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బి.సత్యనారాయణ, సిహెచ్ నాగభూషణం, దేవ ప్రసాద్, హరి రామ్ మాధవి శివజ్యోతి లక్ష్మి ప్రసన్న ముఖేష్ రాథోడ్, వెంకట రామారావు, చిట్లూరి మూర్తి, సూర్యకుమారి, కోమలాదేవి లు తెలిపారు. స్వామివారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో

# మోత్కూర్ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక వాయిదా

**మోత్కూరు మే 5 (జనం సాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీలో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికలు వాయిదా పడటం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సమావేశం నిరర్థకంగా ముగిసింది. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు మధ్యాహ్నం మళ్లీ కౌన్సిల్ సమావేశం నిర్వహించినప్పటికీ, పలువురు కౌన్సిలర్లు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. దీనివల్ల ఎన్నికల ప్రక్రియ మరింత ఆలస్యం కావడం ఖాయంగా కనిపిస్తోంది. మున్సిపాలిటీలో మొత్తం నాలుగు కో–ఆప్షన్ సభ్యుల పదవులు ఖాళీగా ఉండగా, వాటి కోసం 16 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం, అంతర్గత పోటీ తీవ్రంగా ఉండటంతో నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న వర్గ విభేదాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని స్థానికంగా చర్చ జరుగుతోంది. నాయకత్వ స్థాయిలో స్పష్టమైన దిశానిర్దేశం లేకపోవడం, కౌన్సిలర్ల మధ్య సమన్వయం లోపించడం వల్లే ఏకాభిప్రాయం సాధ్యం కావడం లేదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఎప్పటికి పూర్తవుతుందన్న దానిపై అనిశ్చితి నెలకొంది. ప్రజా ప్రతినిధుల మధ్య విభేదాలు కొనసాగితే మున్సిపాలిటీ పరిపాలనపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇకపై నిర్వహించబోయే సమావేశంలో అయినా ఏకాభిప్రాయం సాధించి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

